# సాక్షి అనకాపల్లి

మంగళవారం । 9 । జూలై । 2024




**నేత్ర పర్వంగా నిత్య కల్యాణం**

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.



**ఫిర్యాదుల సత్వర పరిష్కారం**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కలెక్టర్ ఇతర జిల్లా అధికారులు 303 అర్జీలు స్వీకరించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం 30.3/25.0

**వాతావరణం**

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

## న్యూస్‌రీల్

### మత్స్యావతారంలో జగన్నాథుడు



చోడవరం కేశవస్వామి ఆలయంలో మత్స్యావతారంలో జగన్నాథస్వామి

చోడవరం: జగన్నాథస్వామి దశావతారాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవం సందర్భంగా చోడవరం ప్రాచీన కేశవస్వామి ఆలయంలోని ఉపాలయంలో బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని హరినామ సేవ చేశారు.

### విత్తన బంతులతో హరిత విశాఖ సాధ్యం



గ్రీన్ క్లైమేట్ టీమ్‌తో కలిసి మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ (విశాఖ): విత్తన బంతులు చల్లడం వల్ల హరిత విశాఖ సాధ్యమవుతుందని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం విత్తన బంతులను తయారు చేసి అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

### పట్టిచ్చిన వారికి రూ.50 వేల బహుమతి




అనకాపల్లి: నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేల నగదు బహుమతిని పోలీసులు ప్రకటించారు. రాంబిల్లి మండలంలో బాలిక హత్య కేసులో నిందితుడు సురేశ్ పాత, ప్రస్తుత ఫొటోలు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ తెలిసినవారు డయల్ 100, 112 నంబర్లతో పాటు 9440796084, 9440796108, 9440904229, 7382625531 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. హత్య జరగడానికి ముందు దుస్తులు, హత్య జరిగిన తరువాత వేసుకున్న చొక్కా రంగు వివరాలు కూడా వాల్ పోస్టర్లపై ముద్రించారు. నిందితుడి కోసం 12 బృందాలను ఏర్పాటు చేసి తీవ్రంగా గాలిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడు హత్యకు ముందు..తరువాత నిందితుడు బట్టలు మార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. విశాఖపట్నం జైలులో ఉన్న సమయంలో ఎవరితో పరిచయాలు ఉన్నాయనే కోణంలోనూ పోలీసు బృందాలు విచారణ చేస్తున్నాయి.

# నిను మరువలేం రాజన్నా..!



విశాఖ బీచ్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీలు గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ కల్యాణి తదితరులు

మరపురాని మహానేత వైఎస్సార్‌ను ప్రజలు గుండెల్లో దాచుకున్నారు.. ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూనే ఉన్నారు.. రాజన్న చల్లని చూపుతో బాగుపడ్డ కుటుంబాలు కృతజ్ఞతతో ఇప్పటికీ ఆయనను ఆరాధిస్తున్నాయి. అందుకే ఆయన భౌతికంగా దూరమై 15 సంవత్సరాలు గడిచినా జనం హృదయాల్లో చిరంజీవిగా ఉన్నారు. సోమవారం ఆయన 75వ జయంతిని జిల్లా అంతటా ఘనంగా జరిపారు. అభిమానులు వైఎస్సార్ విగ్రహాలు, ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడమే కాక అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆ మహనీయుని బాటలో నడిచారు. –సాక్షి న్యూస్ నెట్‌వర్క్



దేవరాపల్లి మండలం ఎం.అలమండలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



మునగపాకలో మహానేత రాజన్నకు నివాళులు అర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ శ్రేణులు

- ప్రజల గుండెల్లో వైఎస్సార్‌కు సుస్థిర స్థానం
- ఊరూ వాడా నివాళులర్పించిన అభిమానులు

ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి సంక్షేమానికి కృషి చేసిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జనం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశ పెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాల్లో ప్రజల జీవితాల్లో మార్పునకు తీసుకొచ్చాయన్నారు. ఇప్పుడు కూడా దేశంలో అనేక రాష్ట్రాల్లో ఈ పథకాలు అమలు చేస్తున్నారంటే అందుకు వైఎస్సార్ కారణమన్నారు. ఆయన అడుగుజాడల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అద్భుతమైన పాలన అందించారన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

**పేదల హృదయాల్లో రాజన్నకు సముచిత స్థానం**

పేదల హృదయాల్లో మహానేత రాజన్న చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. మునగపాక నందీశ్వర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రసాద్ నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తండ్రి అడుగుజాడల్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని సేవలందించారన్నారు. వాడ్రాపల్లిలో పాలసంఘ అధ్యక్షుడు కొణతాల అప్పారావు చేతులమీదుగా పేదలకు బియ్యం పంపిణీ చేశారు.

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డా. రాజశేఖర్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన సాగించి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎం. అలమండలో సోమవారం జరిగిన మహానేత డా.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలదండ వేసి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధతో కలిసి కట్ చేశారు.
- మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చోడవరం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగుర వేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొత్తూరు జంక్షన్ వద్ద, గాంధీగ్రామం, గోవాడ గ్రామాల్లో వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు.
- అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కశింకోట మండలంలోని తన సొంత గ్రామం ఏఎస్ పేటలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. తాళ్లపాలెం పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు.
- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నర్సీపట్నం అబిద్‌సెంటర్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డాక్టర్ లక్ష్మీకాంత్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.
- డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతేజ యలమంచిలిలో స్టేషన్‌రోడ్డు వద్ద ఉన్న వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యలమంచిలి పార్టీ కార్యాలయం వద్ద పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.
- మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు పాయకరావుపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, జయంతి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అందించి తండ్రి పేరు నిలబెట్టారన్నారు.



యలమంచిలిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ



పాయకరావుపేటలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



చోడవరం కొత్తూరు జంక్షన్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు కేక్ తినిపిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు సన్యాసిపాత్రుడు



కశింకోట మండలం ఏఎస్ పేటలో మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహణ

# బెయిల్‌పై వచ్చే నేరస్తులపై నిఘా

- అధికార యంత్రాంగం దృష్టి పెడితే అనేక ఘోరాలకు ఫుల్‌స్టాప్
- రాంబిల్లి మండలంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, మహిళా కమిషన్ సభ్యుల పర్యటన
- బాధిత బాలిక కుటుంబ సభ్యులకు పరామర్శ



బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, మహిళా కమిషన్ సభ్యులు

సాక్షి, అనకాపల్లి: డ్రగ్స్, పోక్సో కేసుల్లో బెయిల్‌పై విడుదలయ్యే నిందితుల కదలికలను పోలీస్ తదితర సంబంధిత అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్, మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ అన్నారు. అలా జరిగి ఉంటే బాలిక హత్య జరిగేది కాదన్నారు. రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెం గ్రామానికి చెందిన ప్రేమోన్మాది చేతిలో 14 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైన నేపథ్యంలో వారు సోమవారం గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జరిగిన సంఘటనపై పోలీసు అధికారులు, స్థానిక సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో ఆరా తీసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను నిరంతరం గమనించుకోవాలని, చెడు స్నేహాలు, దురలవాట్లు, సోషల్ మీడియాలో ఉత్పన్నమయ్యే చెడు వార్తల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు, మరిన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పోక్సో చట్టాలు, ఇతర బాలల చట్టాలపై ప్రాథమిక తరగతి నుండే అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఇప్పటికే తమ కమిషన్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పోలీస్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని సూచించామన్నారు. వారి వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులు ఇందిరాదేవి, శశికళ, పర్యవేక్షక అధికారి రాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది లక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

# రూ.15 వేల పింఛన్ హామీ తూచ్!

- దివ్యాంగుడిని మంచంపై మోసుకెళ్లి కలెక్టరేట్‌లో ఫిర్యాదు



దివ్యాంగుడు సత్యనారాయణ వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారి

బుచ్చెయ్యపేట: కూటమి ప్రభుత్వంలో అర్హత కలిగిన పింఛన్‌దారులకు మొండి చేయి చూపుతున్నారు. తాజాగా మండలంలోని నీలకంఠాపురానికి చెందిన దివ్యాంగుడు పడాల సత్యనారాయణకు ఇటీవల రూ.15 వేల పింఛన్ ఇవ్వలేదు. అతడు పూర్తి శాతం దివ్యాంగుడు కావడంతో ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితం అయ్యాడు. దానిపైనే ఉంచి కుటుంబ సభ్యులు సపర్యలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో రూ.3 వేల దివ్యాంగ పింఛన్ అందుకున్న అతడికి వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.5 వేల పింఛన్ అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మంచంపై ఉన్నవారికి నెలకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాల్సి ఉంది. అయితే సత్యనారాయణకు మాత్రం రూ.6 వేల పింఛన్ మాత్రమే అందించారు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని మంచంపై మోసుకెళ్లి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



# గందరగోళంగా ఇసుక పాలసీ

- డిపోల వద్ద టన్ను రూ.1225లకే అంటూ ఫ్లెక్సీలు
- ఉచితంగా ఇవ్వడమంటే ఇదేనా.. అని ప్రశ్నిస్తున్న ప్రజలు



నక్కపల్లి ఇసుక డిపోలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం



గబ్బాడ యార్డులో ఏర్పాటు చేసిన బ్యానర్

నక్కపల్లి: ప్రభుత్వం ప్రకటించిన నూతన ఇసుక పాలసీ గందరగోళంగా ఉంది. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామంటూ ఊదరగొట్టి విడుదల చేసిన జీవో నెం 43 లోప భూయిష్టంగా ఉంది. వినియోగదారులకు ఉచిత ఇసుకను ఏవిధంగా సరఫరా చేస్తారనే దానిపై స్పష్టత లేదు. సోమవారం ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఇసుక పాలసీ వినియోగదారులను నిరాశ పరిచింది. ఉచితమని చెప్పి టన్ను రూ.1225లకు విక్రయాలు ప్రారంభించడంతో వినియోగదారులెవరూ తొలిరోజు ఇసుక కొనుగోలు చేయడానికి రాలేదు. దీంతో నక్కపల్లి డిపోలో సోమవారం ఇసుక విక్రయాలు ప్రారంభం కాలేదు. ఇసుక డిపోలో విక్రయ ఏర్పాట్లను నర్సీపట్నం ఆర్డీవో జయరాం, మైనింగ్ ఏడీ సుబ్బారాయుడులు పరిశీలించారు.

**కొత్త సీసాలో పాత సారా**

కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా.. ఇసుక ఉచితం కాదు కొనుక్కోవాల్సిందేనంటూ ప్రభుత్వం సంకేతాలు పంపించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుకను వినియోగదారులకు ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పిన సర్కారు ఆ ప్రకటనకు విరుద్ధంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపోల వద్ద టన్ను ఒక్కంటికి రూ.1225ల చొప్పున విక్రయించేందుకు ఏర్పాట్లు చేసింది. గత ప్రభుత్వంలో నిర్ణయించిన ధర కంటే రూ.25లు అధికంగా విక్రయించే ఏర్పాటు చేయడంతో నిరసన వ్యక్తమవుతోంది

**జీవోలో ఏముందంటే..**

సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన నూతన ఇసుక పాలసీకి సంబంధించిన జీవోలో వినియోగదారులకు ఉపయోగపడే అంశాలు కనిపించడం లేదు. వినియోగదారుల నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయబోమని చెబుతూ.. ఏవిధంగా సరఫరా చేస్తారు, ఎక్కడ నుంచి సరఫరా చేస్తారు అనే విషయాలు జీవోలో పొందుపరచలేదు. ఎక్కడెక్కడ ఇసుక అందుబాటులో ఉంది, రీచ్‌లను ఎన్ని గుర్తించారు, ఎక్కడ రీచ్‌లు అందుబాటులో ఉన్నాయనే వివరాలు కూడా లేవు. సీనరేజ్ ఎంత వసూలు చేస్తారు, లోడింగ్ చార్జ్ ఎంత ఎక్కడ నుంచి ఇసుకను తెచ్చుకోవాలనే దానిపై స్పష్టత లేదు. కలెక్టర్ అధ్యక్షునిగా, జిల్లా మైనింగ్ అధికారి కన్వీనర్‌గా జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసే ఇసుక రీచ్‌ల వద్ద సీనరేజి, లోడింగ్ చార్జీలు డీఎల్ఎస్‌సీ నిర్ణయించిన మేరకు ఉంటాయి.

**నక్కపల్లిలో తొలి రోజు విక్రయాలు నిల్**

నక్కపల్లి డిపోలో 28 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. టన్ను రూ.1225ల చొప్పున కొనుక్కోవాలని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో తొలిరోజు వినియోగదారులు ఎవరూ రాలేదు.దీంతో విక్రయాలు ప్రారంభం కాలేదు.

**గబ్బాడ యార్డులో ప్రారంభమే కాలేదు..**

నర్సీపట్నం: నూతన ఇసుక పాలసీని ప్రభుత్వం సోమవారం సాయంత్రం విడుదల చేయటం వల్ల యార్డుల్లో ఇసుక పంపిణీ ప్రారంభం ఆలస్యమైందని ఆర్డీవో జయరాం తెలిపారు. ఇసుక విధానంపై ప్రభుత్వం కలెక్టర్ చైర్మన్‌గా, వివిధ శాఖల అధికారులతో జిల్లాస్థాయిలో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నిర్ణయం మేరకు ఉచిత ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. నక్కపల్లి యార్డులో ఇసుక పంపిణీని ప్రారంభించామన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్థానికంగా లేకపోవటం వల్ల గబ్బాడ యార్డులో ఇసుక పంపిణీ ప్రారంభించలేదన్నారు. స్పీకర్ చేతుల మీదుగా త్వరలోనే ఇసుక పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.

## క్లుప్తంగా

### డిగ్రీ స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మద్దిలపాలెం(విశాఖ): డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ప్రవేశానికి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన మంగళ,బుధవారాల్లో కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, మాజీ సైనికులు పిల్లలు స్పెషల్ కేటగిరీ కింద వస్తారన్నారు. అలాంటి వారు ఈ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులందరి ధ్రువపత్రాలు కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశీలన ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

### నిరుద్యోగులకు ప్లంబింగ్‌లో శిక్షణ

మహారాణిపేట(విశాఖ): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబింగ్‌లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8వ తరగతి విద్యార్హత కలిగిన వారికి సుమారు 3 నెలల పాటు ప్లంబింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ సమీపంలోని నేక్ కేంద్రంలో స్త్రీ, పురుష అభ్యర్థులకు వేర్వేరుగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. దరఖాస్తులకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 98668 83199, 85005 02395 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా పరిషత్ దగ్గర ఉన్న నేక్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

### రేపు కేంద్ర ఉక్కు మంత్రి స్టీల్‌ప్లాంట్ సందర్శన

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి బుధవారం స్టీల్‌ప్లాంట్ సందర్శించనున్నట్టు సమాచారం. కుమారస్వామిని ఇటీవల కూటమి నేతలు కలిసి స్టీల్‌ప్లాంట్ రావాలని ఆహ్వానించిన విషయం విదితమే. వారి విజ్ఞప్తి మేరకు ఆయన స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్నట్టు తెలిసింది. మంగళవారం ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారు కానున్నట్టు సమాచారం.

# ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు


అర్జీదారుల వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కె.విజయ కృష్ణన్


అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

- అధికారులను ఆదేశించిన కలెక్టర్
- కలెక్టర్ గ్రీవెన్స్‌కు 303 అర్జీలు
- ఎస్పీ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్జీదారులు నివేదించే సమస్యలను వారు సంతృప్తి చెందేలా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె.విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అర్జీదారుల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ప్రజల సమస్యలు వింటూ వారి అర్జీలను సబంధిత విభాగాల అధికారులకు పంపించారు. 12 నమోదు కేంద్రాల ద్వారా 303 ఫిర్యాదులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. గత వారంలో వచ్చిన అర్జీలను ఎంతవరకూ పరిష్కరించారో క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ వారం వచ్చిన ఫిర్యాదులను గడువులోపు పరిష్కారించాలని ఆదేశించారు. ప్రజా సమ్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరకావాలని, అధికారులు నిర్లిప్తత వహిస్తే కుదరదనిహెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీనివాస్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ రమామణి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**భట్లోవ గ్రానైట్ క్వారీపై ఫిర్యాదు**

బుచ్చెయ్యపేట: మండలంలోని శివారు పంచాయతీ గంటికొర్లాం శివారునున్న క్వారీని మూసివేయాలని గ్రామ సర్పంచ్ శరకాన గౌరమ్మ, మాజీ సర్పంచ్ శనివాడ రాజారావులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భట్లోవ రెవిన్యూ పరిధి సర్వే నెం .55ను ఆనుకుని ఉన్న ఊరిలోవకొండలో గ్రానైట్ తవ్వకాల అక్రమాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కొండ గ్రానైట్ తవ్వకాలకు బడాబాబులు ప్రక్క మండలంలో నుండి ఎన్‌వోసీ తీసుకుని తరలించుకుపోతున్నారని పేర్కొన్నారు. బాంబులు పెట్టి బ్లాస్టింగ్ చేయడంతో తమ వ్యవసాయ భూముల్లోకి రాళ్లు వచ్చి పడుతున్నాయని, దీంతో భూములు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భట్లోవ రెవెన్యూ పరిధిలో ఉన్న చెరువును, శ్మశాన భూమిని ధ్వంసం చేస్తున్న గ్రానైట్ తవ్వకాలను తక్షణమే నిలిపేయాలని కలెక్టర్‌ను కోరారు.

**జిల్లా ఎస్పీ కార్యాలయంలో..**

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదులను స్వీకరించారు. వాటిపై చట్టం ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమానికి 36 ఫిర్యాదులు రాగా వాటిలో ఆస్తితగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి ఫిర్యాదులున్నాయి. దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఎస్ఐ దివ్య పాల్గొన్నారు.

## ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులపై ఆగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సోమవారం జారీ చేసిన రెండు ఉత్తర్వులపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. యాజమాన్యం వ్యవహరించిన తీరుపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. స్టీల్‌ప్లాంట్ గేట్లు వద్ద, ప్లాంట్‌లోని విభాగాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది బ్రెత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేస్తారని, ఉద్యోగులు సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒకవైపు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులను తాగుబోతులుగా భావించి తనిఖీలు చేస్తానని చెప్పడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోవడానికి మీ జీతం నుంచి స్వచ్ఛంద విరాళాలు ఇవ్వడం లేదా జీతంలో కొంత భాగాన్ని నిర్దిష్ట కాలానికి వాయిదా వేయమని అభ్యర్థిస్తున్నట్టు మరో ఉత్తర్వు జారీ చేయడం ఉద్యోగులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఏడేళ్లుగా వేతన సవరణ జరగకుండా పాత జీతాలతో నెట్టుకురావడంతో పాటు ఒక్కొక్క సదుపాయం కోల్పోతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు అశనిపాతంగా మారింది. నెల జీతాన్ని నెలాఖరుకు రెండు భాగాలుగా ఇస్తున్నా అర్థం చేసుకుంటున్న ఉద్యోగుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును కార్మిక సంఘాలు, అసోసియేషన్లు తీవ్రంగా విమర్శిస్తున్నాయి.

## ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లకు ఆటంకం

మురళీనగర్(విశాఖ): ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లు ఎంపికకు సోమవారం సర్వర్ పనిచేయక ఇబ్బందులు ఎదురయ్యాయి. సోమవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ షెడ్యూలు ప్రకటించింది. కానీ మొదటి రోజు వెబ్‌సైట్‌లో వెబ్ ఆప్షన్ల ఎంపికకు సంబంధించి సైట్ ఓపెన్ కాలేదు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, కంచరపాలెం గైస్‌లకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి అనేక మంది విద్యార్థులు చేరుకుని నిరాశతో వెనుతిరిగారు. మొదటి రోజు వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్య వల్ల ఒక రోజు గడువును కోల్పోయినందున షెడ్యూల్‌లో వెబ్ ఆప్షన్లకు మరొక రోజు పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఒకేషనల్ విద్యార్థులకు అపారమైన అవకాశాలు

జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రాధ


మాట్లాడుతున్న డీవీఈవో రాధ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు అపారమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ అన్నారు. విశాఖ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ బోర్డు ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్, రోటరీ క్లబ్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టారు. ఈ సందర్భంగా డీవీఈవో రాధ మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, ఫిజియోథెరఫీ, టాక్సేషన్ వంటి కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఇంటర్‌తోనే ఉపాధి దక్కించుకోవచ్చన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రెగ్యులర్ కోర్సులతో పాటు, ఒకేషనల్ కోర్సుల బోధనపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.విజయ తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు

- సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్


గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విశాఖ కలెక్టర్

మహారాణిపేట(విశాఖ): ఈనెల 20న నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణ పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమన్వయ అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ తెల్లవారుజాము నుంచి 21 సాయంత్రం వరకు గిరిప్రదక్షిణ జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ బందోబస్తుతోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద తోపులాటలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఆలయ ఈవో శ్రీనివాస మూర్తి సూచనల మేరకు అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశా వర్కర్లను శిబిరాల వద్ద ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సదుపాయం ఉండాలని, అవసరమైతే జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అప్పుఘర్ వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. అలాగే ఈనెల 20,21వ తేదీల్లో మద్యం షాపులు మూసివేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్.విశ్వనాథన్, సింహాచలం దేవస్థానం ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి,, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ మహేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్.వి.రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అనంత్ అంబానీకి సృజనాత్మక జ్ఞాపిక


అనంత్ అంబానీ, రాధికల చిత్రాన్ని గీస్తున్న కళాకారుడు ఆర్తు సంఘవి


ఆర్తు సంఘవిని అభినందిస్తున్న కంచర్ల అచ్యుతరావు

కశింకోట: ప్రముఖ వ్యాపార దిగ్గజం ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికామర్చంట్‌లకు పెళ్లికానుకగా ఉత్తరాంధ్ర నుంచి ఓ సృజనాత్మక జ్ఞాపికను జాతీయ పెన్సిల్ ఆర్ట్స్ కళాకారుడు ఆర్తు సంఘవి అందించనున్నాడు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అనకాపల్లికి చెందిన ఆర్తు సంఘవి న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో చేరనున్నాడు. గతంలో దేశ, విదేశీ ప్రముఖుల పెన్సిల్ స్కెచ్‌లను రూపొందించి వారికి అందించిన ఈ కళాకారుడు అనంత అంబానీ, రాధికల చిత్రాన్ని పెన్సిల్‌తో చక్కగా తీర్చిదిద్దాడు. ఈ నెల 12లోపు నూతన వధూవరులకు ఈ జ్ఞాపిక చేరేలా ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ఏర్పాట్లు చేస్తున్నారు. విమానంలో ఈ పెయింటింగ్‌ను అనంత్ అంబానీకి పంపనున్నారు. కంచర్ల అచ్యుతరావు సూచనల మేరకు అనకాపల్లి నూకాలమ్మ, సింహాచలం అప్పన్న, శ్రీకాకుళం సూర్యనారాయణ చిత్రాలను దీవెనలుగా జోడించి నలుపు, తెలుపు పెన్సిల్ ఆర్ట్ చుట్టూ ఆకర్షణీయంగా శుభాకాంక్షలు తెలుపుతూ జ్ఞాపికను రూపొందించాడు. విశాఖ సీతమ్మధార కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్తు సంఘవిని కంచర్ల అచ్యుతరావు అభినందించారు. అనంత్ అంబానీ వివాహం సందర్భంగా ఉత్తరాంధ్ర కళాకారుల తరఫున ఈ జ్ఞాపికను పంపిస్తున్నట్లు ఆర్తు తెలిపాడు.

## రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో అక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీ సాహూ


తాటిచెట్లపాలెం(విశాఖ): రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును పరిరక్షించుకోవలసిన బాధ్యత రైల్వే ఉద్యోగులదేనని ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఎన్ఎఫ్ఐఆర్ అడిషనల్ జాయింట్ సెక్రటరీ ఆర్‌సి సాహూ సూచించారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో కోట్లాదిరూపాయలు పైగా షేర్ హోల్డర్ల డిపాజిట్ సొమ్ము గల్లంతయిందని, షేర్ హోల్డర్లకు ఇవ్వాల్సిన సుమారు రూ.100 కోట్లకు పైబడిన డివిడెండ్లు చెల్లించలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లు అవినీతి, అక్రమాలకు పాల్పడి, పదేళ్లుగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు జరగకుండా చేశారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై సీబీఐ, విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ నెల 24, 25వ తేదీల్లో అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నరసింగరావు, డివిజనల్ కో ఆర్డినేటర్ టీవీ మౌళీశ్వర్రావు (మౌళి), అడిషనల్ జనరల్ సెక్రటరీలు కోటేశ్వర్రావు, వెంకటరావు, ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌వీ పాపారావు, కేంద్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 40 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు


పట్టుబడిన గంజాయితో పోలీసులు

మాకవరపాలెం: తరలించేందుకు సిద్ధం చేసిన 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు. మండలంలోని భీమబోయినపాలెం గ్రామానికి చెందిన మురుకుట్టి ఈశ్వరసాయిసతీష్(20) ఇంటి వద్ద గంజాయి ఉన్నట్టు అందిన సమాచారంతో సోమవారం సిబ్బందితో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రెండు గోనె సంచుల్లో ఉన్న 40 కేజీల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకుని, ఈశ్వరసాయిసతీష్‌ను అరెస్టు చేశారు. సతీష్ రెండు నెలల క్రితం గంజాయి తరలిస్తూ గాజువాక వద్ద పట్టుబడి జైలుకు వెళ్లినట్టు ఎస్ఐ చెప్పారు. బెయిల్‌పై వచ్చిన యువకుడు మళ్లీ గంజాయితో పట్టుబడటంతో, అరెస్టు చేసి కోర్టుకు అప్పగించామన్నారు.

## రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం


గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖ రైల్వేస్టేషన్ కేంద్రంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగుర్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ జీఆర్పీ ఎన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణల ఆధ్వర్యంలో విశాఖ రైల్వేస్టేషన్‌లో సోమవారం పలు ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో హర్యానాకు చెందిన జితేందర్ (38), జితేందర్ (33), దీపక్(32), రాజ్‌కుమార్‌ల బ్యాగులను తనిఖీ చేశారు. రూ1.58లక్షల విలువైన సుమారు 31.6 కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## ప్రాంతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం


బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం(విశాఖ): తాటిచెట్లపాలెంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో ప్రాంతీయస్థాయి అండర్ 14, 17 బాలుర బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కేంద్రీయ విద్యాలయ చైర్మన్, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. అండర్ 14లో మూడు స్కూళ్లు, అండర్ 17లో ఆరు స్కూళ్లకు చెందిన క్రీడాకారులు పోటీలో పాల్గొంటున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతులు, మెడల్స్ అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటీ మాస్టర్ రియాజ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు



తాటిచెట్లపాలెం(విశాఖ) : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10 వరకు, తిరుగు ప్రయాణంలో కడపలో బయల్దేరే కడప – విశాఖపట్నం (17487) తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 6 నుంచి 11 వరకు రద్దు చేశామని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. మరికొన్ని రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. కింది రైళ్లు ఆగస్టు 2 నుంచి 10 వరకు రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా గుణదల, రాయనపాడు మీదుగా రాకపోకలు సాగిస్తాయని, మళ్లించిన మార్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు హాల్ట్‌లను ఇస్తున్నట్లు తెలిపారు.

- విశాఖపట్నం – న్యూఢిల్లీ (20805) ఏపీ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ – ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్ – హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం – లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – విశాఖపట్నం (12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, ముంబయి – భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ – విశాఖపట్నం (20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, సాయినగర్ షిర్డీ – విశాఖపట్నం (18504) ఎక్స్‌ప్రెస్, లోకమాన్యతిలక్ టెర్మినస్ – విశాఖపట్నం (18520) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.
- విశాఖపట్నం – హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5, 9న, విశాఖటప్నం – సాయినగర్ షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 8న, టాటా – యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 8న, విశాఖపట్నం – హైదరాబాద్ – విశాఖపట్నం (12727/12728)) గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3 నుంచి 11 వరకు, విశాఖపట్నం – గాంధీ ధామ్ (20803) ఆగస్టు 8న, పూరి – ఓఖా (20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4న, గాంధీ ధామ్ – విశాఖపట్నం (20804) ఆగస్టు 4న, హజరత్ నిజాముద్దీన్ – విశాఖపట్నం (12804) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4, 7న, యశ్వంత్‌పూర్ – టాటా (18112) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4న, హైదరాబాద్ – షాలిమర్(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3 నుంచి 11 వరకు, సాయినగర్ షిర్డీ – విశాఖపట్నం (18504) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2, 10న మళ్లించిన మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.

**పూరీ రథయాత్ర కోసం ప్రత్యేక రైళ్లు**

పూరీ రథయాత్రలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే సాధారణ పాసింజర్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. నౌపడ – పూరి (08333) మధ్య ఈ నెల 15, 16న నౌపడలో ఉదయం 4 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 12.05 గంటలకు పూరీ చేరుకుంటుంది. పూరీ – నౌపడ (08334) స్పెషల్స్ ఈ నెల 15, 17న రాత్రి 11 గంటలకు పూరీలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకు నౌపడ చేరుకుంటాయి.

# నాకవుట్‌కు లయన్స్

కింగ్స్, వారియర్స్ కూడా..


అర్ధ సెంచరీలతో చెలరేగిన తేజ, ధీరజ్


నాకవుట్‌కు చేరిన లయన్స్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ నాకవుట్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. వైజాగ్ వారియర్స్‌పై 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన వారియర్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన లయన్స్ ఆరు వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది. ఓపెనర్ తరుణ్ (60), మరో బ్యాటర్ ధీరజ్ కుమార్ 25 బంతుల్లో అర్ధసెంచరీ నమోదు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వారియర్స్ జట్టులో ఓపెనర్లు అశ్విన్ (20), కెప్టెన్ భరత్ (18) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరుకున్నారు. దీంతో జట్టు కష్టాల్లో పడింది. 63 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. మరో వైపు వికెట్లు పడుతున్నా తేజ, యువన్ కలిసి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. ఈ క్రమంలో తేజ అర్ధసెంచరీ నమోదు చేశాడు. యువన్ కేవలం 29 బంతుల్లో 65 పరుగులు చేసి విజయం వైపు ఆశలు కల్పించాడు. అయితే తరువాత వికెట్ల పతనం ప్రారంభ కావడంతో వారియర్స్ జట్టు 183 పరుగులకు ఆలౌటైంది. దీంతో నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట విజయంతో పన్నెండు పాయింట్లు సాధించి ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు నాకవుట్‌కు చేరింది. ఐదు మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లు సాధించిన వారియర్స్ కూడా ప్లేఆఫ్‌కు చేరుకుంది.

**కింగ్స్‌కు మరో విజయం**

మరో మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై రాయలసీమ కింగ్స్ విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్ జట్టు ఎనిమిది వికెట్లకు 171 పరుగులు చేసింది. ప్రశాంత్ 60, రోషన్ 16, వంశీకృష్ణ 18, కుమార్ 27, రోహిత్ 32 (నాటౌట్) పరుగులు చేశారు. హరిశంకర్, లలిత్ రెండేసి, సాయిరాహుల్ మూడు వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఓపెనర్ ధృవ్(2)ను ఎనిమిది పరుగుల వద్ద కోల్పోయింది. కెప్టెన్ మహీప్(45) నిలకడగా ఆడి రెండో వికెట్‌గా 66 పరుగుల వద్ద వెనుతిరిగాడు. 31 పరుగులు జోడించి మరో మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెడ్డి 21 పరుగులు చేశాడు. చివరికి టైగర్స్ జట్టు 19.1 ఓవర్లలోనే 133 పరుగులకు ఆలౌటై 38 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అంజనేయులు, కుమార్ చెరో రెండేసి, కమరుద్దీన్ నాలుగు వికెట్లు తీశారు. దీంతో కింగ్స్ లీగ్‌లో ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసి పాయింట్ల పట్టికలో పదహారు పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

## క్లుప్తంగా

### విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి వితరణ



చిన్నారులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కాండ్రేగుల నాయుడు

**అనకాపల్లి:** ఆటపాటలతో చిన్నారులకు విద్యను బోధిస్తే వారు సులభంగా అర్థం చేసుకుంటారని భవ్యశ్రీ డెవలపర్స్ అధినేత కాండ్రేగుల నాయుడు అన్నారు. స్థానిక గవరపాలెం సతకంపట్టు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీ సామగ్రి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు చెప్పే ఉపాధ్యాయులు చిన్నారుల పట్ల అధిక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్ది, వారిని ఉన్నత శిఖరాలకు చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో గవరపాలెం కనకదుర్గ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, వివిధ దేవాలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### తుప్పు పట్టిన ట్రాన్స్‌ఫార్మర్



పాతబడిన ట్రాన్స్‌ఫార్మర్

**అనకాపల్లి:** స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణమండపం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తుప్పుపట్టి పాడైపోయే దశకు చేరుకుంది. ఈ ప్రాంతంలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పాతబడిపోవడంతో నిత్యం విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. వెంటనే పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### రావాడలో ప్రొటోకాల్ ఉల్లంఘన

**పరవాడ:** రావాడ గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారు. గ్రామసభలో డయాస్ పైకి సర్పంచ్‌తో పాటు స్థానిక ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావును ఆహ్వానించలేదు. గ్రామ పంచాయతీలో అనేక గ్రామ సభలు నిర్వహించిన అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడం సమంజసం కాదని ఆరోపించారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 71 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 5,370 | 5,370 |
| రెండో రకం | 3,800 | 3,800 |
| మూడోరకం | 3,300 | 3,700 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మహారాజ | :రాజా |
| కల్కి2898 ఏడీ | :సత్యనారాయణ స్క్రీన్-1 |
| కల్కి2898 ఏడీ | :సత్యనారాయణ స్క్రీన్-2 |
| కల్కి2898 ఏడీ | :షిర్డిసాయి |
| కల్కి2898 ఏడీ | :పర్తిసాయి |
| మనమే | :వెంకటేశ్వర |
| రాజధాని రౌడీ | :శ్రీసత్య |
| హనీమూన్ ఎక్స్‌ప్రెస్ | :రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



# ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు వైఎస్సార్



రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో కేక్ కట్ చేసి నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్‌కు తినిపిస్తున్న మాజీ ఎంపీ బీవీ సత్యవతి తదితరులు



కశింకోట పీహెచ్‌సీలో బాలింతకు రొట్టెలు, పండ్లు అందిస్తున్న మలసాల భరత్‌కుమార్



కశింకోటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, స్థానిక నాయకులు

- ఊరూవాడా ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- పలు సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**అనకాపల్లి నియోజకవర్గంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఊరూవాడా వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆ మహనీయుడు చూపిన బాటలో పలు సేవా కార్యక్రమాల ద్వారా ఆర్తులకు, అభాగ్యులకు సాయపడ్డారు. చాలా చోట్ల కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు.**

**అనకాపల్లి/కశింకోట:** ఏళ్లు గడిచినా దివంగత మహానేత వైఎస్సార్‌పై జనాల్లో ఉన్న అభిమానం చెక్కుచెదరలేదు. భౌతికంగా ఆయన దూరమై ఒకటిన్నర దశాబ్దాలవుతున్నా ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. అందుకే ఆ మహనీయుడి జయంతి సందర్భంగా వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఆస్పత్రుల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంక్షేమ పథకాల రథసారధి దివంగత సీఎం వైఎస్సార్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని మాజీ ఎంపీ బీవీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, అభిమానులకు, పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల పక్షాన పోరాడేందుకు తామెప్పుడూ సిద్ధంగానే ఉన్నట్లు తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిన ఘనత వైఎస్సార్‌దేనని కొనియాడారు. తండ్రికి మించిన తనయుడిగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలను బలహీన వర్గాలకు అందించారన్నారు. రాష్ట్ర ప్రజలు మర్చిపోతున్న కాంగ్రెస్ పార్టీకి జీవం పోసిన మహానేత మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. వైద్యరంగలో అనే మార్పులు తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు అమలు చేయకపోతే తమ పోరాటాలు సాగిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ 2029 ఎన్నికల కోసం శక్తివంచన లేకుండా పార్టీశ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, మలసాల కిషోర్, పార్టీ సీనియర్ నాయులు బొడ్డేడ శివ, జాజుల రమేష్, కొణతాల భాస్కర్, సూరిశెట్టి రమణఅప్పారావు, ఏవీ రత్నకుమారి, కొణతాల మురళీకృష్ణ, మరిపల్లి శోభ, పలకా రాము, లక్ష్మి, కుండల రామకృష్ణ, కె.ఎం.నాయుడు, కొరుకొండ రాఘవ, రాజు, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కశింకోటలోని తన స్వగ్రామం ఏఎస్ పేటలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన అందించిన సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్తరాలకు ఆదర్శప్రాయమన్నారు.

- కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికీ పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బాణసంచా కాల్చారు.
- స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.
- తాళ్లపాలెం కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అక్కడి పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు అందించారు.

కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజీమెన్, తాళ్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, పార్టీ యువజన విభాగం నాయకులు మలసాల కుమార్‌రాజా, లగిశెట్టి గణేష్, చిన్ని రాజీవ్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, చెవ్వేటి ప్రకాష్, మహిళా ప్రతినిధి తగరంపూడి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని జమాదులపాలెంలో వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.
- ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- కశింకోటలోని శివాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించాయి.
- మండలంలోని తీడ, కన్నూరుపాలెం, నరసింగబిల్లి తదితర గ్రామాల్లో కూడా వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి.
- రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత దివంగత రాజశేఖర్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక పూడిమడక జాతీయ రహదారిలో వైఎస్సార్ విగ్రహానికి నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్‌కుమార్‌తో కలిసి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాజశేఖర్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలనను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆళ్ల నాగేశ్వరరావు, కలగా గున్నయ్య నాయుడు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.
- మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్‌లో వైఎస్సార్ పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 80, 81వ వార్డుల కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కర్, కోన ఉమా, గొన్నాబత్తుల బాబురావు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.
- 80వ వార్డు నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారిలో కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి మలసాల భరత్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింగరావు, శేఖర్, కొణతాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మలసాల భరత్‌కుమార్ క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.
- గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి మలసాల భరత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి భోగలింగేశ్వరరావు, సూరిశెట్టి రమణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు రొట్టె, పాలు, ఫ్రూట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, జాజుల రమేష్, మూనూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- వేల్పులవీధి పార్కువద్ద దివంగత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.
- అంతకుమందు కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొండా శంకరరావు, వేల్పుల గణేష్, సోమిశెట్టి భార్గవ్, జెట్టి శ్రీనివాసరావు, కొంకి శ్రీరాంమూర్తి, కొడుకుల సుబ్రహ్మణ్యం, రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని వెంకుపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీఐడబ్ల్యూ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, నాయకులు ఆడారి సూరి అప్పారావు, వర్మరాజు, ఎరుకునాయుడు, కొత్తపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్ పేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్



ఉగ్గినపాలెంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



జమాదులపాలెంలో వైఎస్సార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కరక సోమునాయుడు



పూడిమడక హైవేలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్, భరత్‌కుమార్



పెరుగుబజార్ జంక్షన్ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



80వ వార్డులో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మలసాల భరత్‌కుమార్



81వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మలసాల భరత్‌కుమార్



అగ్గిమర్రిచెట్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న మలసాల భరత్‌కుమార్



వేల్పులవీధి పార్కువద్ద నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న జాజుల రమేష్



వెంకుపాలెంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గొర్లి సూరిబాబు, దిలీప్‌కుమార్

## కూర్మావతారంలో జగన్నాథుడు

**అనకాపల్లి:** స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

**కశింకోట వేణుగోపాలుడి ఆలయంలో..**

**కశింకోట:** స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజైన సోమవారం స్వామి వారిని విష్ణుమూర్తి దశావతారాల్లో రెండో అవతారమైన కూర్మావతారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. రాత్రి జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రుల విగ్రహాలను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తుల గోత్ర నామాలతో అర్చన జరిపి, ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, శ్రీరామ చరణాచార్యులు, మారుతి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శించుకుని, పూజలు నిర్వహించారు.



కశింకోటలో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలుడు



కూర్మావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథస్వామి



స్వామి దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాం పంపిణీ చేస్తున్న తట్టా పెంటయ్యనాయుడు

**అనకాపల్లి:** ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ఉపాధ్యాయులు దృష్టి సారించాలని తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు కోరారు. మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన యూనిఫాంను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇష్టపడి చదువుకోవాలన్నారు. తంచనుగా, సకాలంలో విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు కూడా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శంకరరావు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఎల్లయ్య కాలువ పూడికతీత పనులు**

తుమ్మపాల పంచాయతీ పరిధి ప్రమీలానగర్ వద్ద ఎల్లయ్యకాలువలో పూడిక తొలగింపు పనులకు సుమారు రూ.80 లక్షల వరకు ఖర్చవుతుందని సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు అన్నారు. సోమవారం కాలువను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతానికి పంచాయతీలో పెద్ద మొత్తంలో నిధులు లేవని, జేసీబీ, ట్రాక్టర్ సాయంతో పూడిక తొలగింపు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ విషయమై గ్రామసభలో, బోర్డు మీటింగ్ నిర్వహించి, తీర్మానం చేస్తామన్నారు.

## రూ.70 లక్షలతో పంట కాలువల్లో పూడిక తొలగింపు

**అనకాపల్లి:** జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని నాగులాపల్లి, ఎల్లయ్య కాలువల్లో పూడికతీత పనులను సోమవారం జీవీఎంసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ రెండు కాలువల్లో పూడిక తీత పనులకు ప్రభుత్వం రూ.70 లక్షల నిధులు విడుదల చేసిందన్నారు. పూడిక తొలగింపు సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలు జీవీఎంసీ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు. పంటకాలువల్లో స్థానికులు చెత్తా చెదారం వేయడం వల్లే పూడిక పెరిగి, నీరు నిలిచిపోతోందన్నారు. దీని వల్ల దోమల వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రతకు దోహదపడాల్సిందిగా కోరారు. వీలైనంత వేగంగా పంట కాల్వల్లో పూడిక తొలగించి, సాగు సమయానికి నీటి సరఫరాకు ఆటంకాల్లేకుండా చూస్తామన్నారు.



ఎల్లయ్య కాలువలో జేసీబీ సాయంతో పూడిక తొలగింపు

## వీధి దీపాల పునరుద్ధరణ

**కశింకోట:** మండలంలోని ఉగ్గినపాలెంలో సోమవారం వీధి దీపాలను పునరుద్ధరించారు. పలు చోట్ల వీధి దీపాలు వెలగని నేపథ్యంలో వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు ఆధ్వర్యంలో వీటిని బిగించారు.

## బకాయి జీతాలు చెల్లించాలని వినతి

**అనకాపల్లి:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అనకాపల్లి జోన్ పరిధిలో తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన 15 మంది ఒప్పంద కార్మికులకు చెల్లించాల్సిన ఐదు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు అజయ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నెలల తరబడి జీతాల్లేక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం, అధికారులు తక్షణమే బకాయిపడ్డ ఐదు మాసాల జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## హైస్కూల్ సమీపంలో ఫార్మా వ్యర్థాల డంప్



పెదముషిడివాడ చెరువులో విడిచిపెట్టిన ఫార్మా వ్యర్థ రసాయనాల డ్రమ్ములు

**పరవాడ:** పెదముషిడివాడ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోని ఓ చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు ఫార్మా వ్యర్థ రసాయనాలతో నిండిన డ్రమ్ములను సోమవారం వేకువజామున డంపింగ్ చేసి చల్లగా జారుకున్నారు. డ్రమ్ముల నుంచి విపరీతమైన దుర్వాసన రావడంతో స్థానికులు భరించలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చెరువులో విడిచిపెట్టిన వ్యర్థ రసాయన డ్రమ్ముల సమాచారాన్ని స్థానికులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ( పీసీబీ) అధికారులకు సమాచారమిచ్చారు. వ్యర్థ రసాయనాలను ఎక్కడపడితే అక్కడ విడిచిపెట్టడడం వల్ల భూగర్భ జలాలు కలుషితం కావడమే కాకుండా వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులో డంపింగ్ చేసిన డ్రమ్ములపై పరవాడ, అచ్యుతాపురం ఫార్మా కంపెనీలకు సంబంధించిన లేబుళ్లు ఉన్నాయని చెబుతున్నారు. చెరువులో వ్యర్థ రసాయనాల డ్రమ్ములు విడిచిపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.